క్లుప్తంగా

జెడ్పీ సీఈఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: జెడ్పీ జీపీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెడ్పీ సీఈఓ దీక్షారైనాకు విన్నవించినట్లు పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆమెకు జీపీఎఫ్ ఖాతాల్లో 2022 మార్చి నుంచి ఇంట్రెస్ట్ క్రెడిట్ కావటం లేదని, మూడేళ్లుగా ఖాతాల నిర్వహణ సక్రమంగా లేదని పలు విషయాలను విన్నవించగా స్పందించిన సీఈఓ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ట శేఖర్‌రావు, తాళ్లూరి చంద్రశేఖర రావు, రత్నకుమార్, లింగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 53వ డివిజన్ గట్టయ్య సెంటర్‌లో బీజేపీ నాయకులు శ్రీలత, ఖమ్మం టూ టౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు, పెరుగు వెంకటరమణ, సన్నే ఉదయ ప్రతాప్, అల్లిక అంజయ్య, రవి, రమేష్, సరస్వతి, మేకల నాగేందర్, సుధాకర్, రాజేష్, రవి రాథోడ్, శ్యామ్ రాథోడ్, భద్రం, వంశీ, శీను, లక్ష్మణ్, నరేష్, వీరభద్రప్రసాద్, అనిత, విజయ రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి సస్పెండ్

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు సామా శ్రీనివాసరెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భాషబోయిన వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్, పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జి కందాళ ఉపేందర్ రెడ్డి ఆదేశాలతో సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.

క్రీడాకారిణిని అభినందించిన మంత్రి

ఖమ్మం స్పోర్ట్స్: ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైన ఖమ్మం క్రీడాకారిణి బి.వైశాలిని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అభినందించారు. ఆమె ఈనెల 12నుంచి బీహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొననుండగా, ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో వైశాలితో పాటు కోచ్ ఎండీ.గౌస్‌ను వారు అభినందించి మాట్లాడారు. డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు మందుల వెంకటేశ్వర్లు, సున్నా రాధాకృష్ణ, ఎండీ.షఫీక్ అహ్మద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

కూసుమంచి: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన, కులగణన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కృషి ఫలితమేనని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కూసుమంచి బస్టాండ్ సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కామేపల్లి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటంతోనే కేంద్ర క్యాబినెట్‌లో జనగణన, కులగణనకు ఆమోదం తెలిపిందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అన్నారు. ఈ మేరకు కొత్తలింగాల క్రాస్ రోడ్డులో బీసీ సెల్ కమిటీ ఆధ్వర్యాన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు చేశారు. కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మలపాటి సత్యనారాయణ, దొడ్ల వేణు, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, బత్తుల ఉపేందర్, మేకపోతుల మహేష్ తదితరులు ఉన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని అనంతనగర్ గ్రామానికి చెందిన బాలిక(16) శుక్రవారం వివిధ రకాల మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి ఆమెను నేలకొండపల్లికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. ఆమె ఆత్మాహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	రెట్రో, జింఖానా
సాయిరాం	థండర్ బోల్ట్స్
ఆదిత్య	జింఖానా,
	అర్జున్ S/o వైజయంతి
శ్రీనివాస	హిట్: ది థర్డ్ కేస్

- ఖమ్మంవ్యవసాయం

ఫైర్ కష్టాలు తీరేదెన్నడు?

అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం లేక ఇక్కట్లు

- సిబ్బందికి తప్పని తిప్పలు



స్టేషన్‌కు కేటాయించిన భవనం

కూసుమంచి: ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ (అగ్నిమాపక కేంద్రం) ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించి ఇందులో భాగంగా పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచికి ఫైర్‌స్టేషన్ కేటాయించారు. ఆపై భవన నిర్మాణానికి నాటి ప్రభుత్వం రూ.25 లక్షలు కూడా మంజూరి చేసింది. దీంతో కొన్నేళ్లుగా ఫైర్‌స్టేషన్ కొనసాగుతున్నా పక్కా భవన నిర్మాణం మాత్రం జరగలేదు. ఫలితంగా కూసుమంచిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత భవనంలో కొనసాగిస్తున్నారు.

స్థలం కోసం అన్వేషణ...

ఫైర్‌స్టేషన్‌కు పక్కా భవనం కోసం స్థలం సమస్యగా మారింది. గతంలో రెవెన్యూ అకాడమీ వద్ద స్థలాన్ని ఎంపికచేయగా అది అనువుగా లేదని అధికారులు తిరస్కరించారు. కాగా ప్రస్తుతం గట్టుసింగారం రెవెన్యూ పరిధిలో కస్తూర్బా పాఠశాల సమీపంలో ఇందుకు స్థలాన్ని గుర్తించగా దాన్ని రెవెన్యూ అధికారులు అప్పగించాల్సి ఉంది. ఈవిషయమై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు.

సిబ్బందికి ఇబ్బంది...

ఇక్కడ స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. షిఫ్ట్‌ల వారీగా వారు 24 గంటలు విధుల్లో ఉంటున్నారు. కానీ వారికి తగిన సౌకర్యాలు లేవు. వారికి పాఠశాల పాత భవనంలో కంప్యూటర్ ల్యాబ్ నిర్వహించిన భవనాన్ని అప్పగించటంతో ఆ గదిలోనే ఓ పక్క శుభ్రం చేసుకుని సిబ్బంది విశ్రాంతి తీసుకుంటుండగా మరో పక్క ఫైర్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. బయట ఆవరణలో డ్యూటీలో ఉన్న వారు విధులు నిర్వహిస్తున్నారు. ఈ గది ఇరుకుగా ఉండటంతో పాటు వర్షాకాలం భవనం తడిసిపోతుంది. ఇలా అనేక సమస్యల నడుమ సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

ఫైర్‌స్టేషన్‌కు పక్కా భవనం లేకపోవటంతో పాటు ఫైరింజన్ వాహనాన్ని నిలిపేందుకు షెడ్ లేకపోవటంతో వాహనం ఎండకు ఎండుతూ... వానకు తడవాల్సి వస్తుంది. వేసవి కాలంలో వాహనం ఎండలకు దెబ్బతినే ప్రమాదం ఉందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వాహనానికి షెడ్ లేకపోవడంతో దానికి సంబంధించిన సామాగ్రిని పాఠశాల పాత భవనంలోని మరో గదిలో స్టోర్ చేయాల్సి వస్తుంది.



పాఠశాల ఆవరణలో ఉన్న ఫైరింజన్

సమస్యలు ఉన్నాయి...

కూసుమంచిలోని ఫైర్ స్టేషన్‌కు పక్కా భవనం లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. సమస్యలు స్థానిక మంత్రితో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. కస్తూర్బా పాఠశాల వద్ద స్థలం అనువుగా ఉంది. దాన్ని మాకు అప్పగించిన వెంటనే భవన నిర్మాణం ప్రారంభం అవుతుంది. మా ఇబ్బందులు తీరుతాయి.

– రామారావు, ఫైర్ ఆఫీసర్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కామేపల్లి: తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కామేపల్లి: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కామేపల్లి, ముచ్చర్ల, జాస్తిపల్లి, బాసిత్‌నగర్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలతో పాటు కల్లాల్లో తడిసిన మిర్చి, వరి ధాన్యాన్ని పరిశీలించారు. పండించిన పంటలకు సరైన ధర లేక రైతులకు పెట్టుబడులు రాక అప్పుల పాలైయ్యారని, అకాల వర్షంతో యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ, మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ, వీరభద్రం, రాములు, అమరనేని కృష్ణ, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: గాలి దుమారంతో పాటు, కురిసిన అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. పంట అమ్ముకునే దశలో రైతాంగం ప్రతీ ఏటా తీవ్రంగా నష్టపోతున్నారని, ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ నష్టం సంభవించిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. రైతులను ఆదుకోవాలిసిన బాధ్యత ప్రభుత్వానిదేనని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి కోశాధికారి లక్ష్మణ్, దేవల పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన



బుద్ధారంలో పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: భూ భారతి అమలుకు మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఈ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణకు ప్రత్యేకంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ బృందాలు దరఖాస్తుకు సంబంధించిన వివరాలను మండలంలోని బుద్ధారం, చెరువుమాదారం, బోదులబండ, నేలకొండపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుద్ధారంలో బోనకల్ డిప్యూటీ తహసీల్దార్ టి.కరుణాకర్‌రెడ్డి, రఘునాథపాలెం ఆర్ఐ సత్యనారాయణ, ఏఈవో శిరీష, జూనియర్ అసిస్టెంట్లు నవీన్ పొలాల వద్దకు వెళ్లి వివిధ అంశాలపై ఆరా తీశారు. పరిసర ప్రాంతాలలో రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్‌లు కొలతలు క్షేత్ర స్థాయిలో అధికారుల సమక్షంలో తీసుకున్నారు. ఈ వెరిఫికేషన్‌ను తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కూసుమంచి: కరపత్రాల ఆవిష్కరణ..


కూసుమంచి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం, ఎంఈఓ రాయల వీరస్వామి అభినందించారు. తమ పాఠశాలలో 132 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 117 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫోటోలతో కూడిన కరపత్రాలను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..


ఖమ్మం మామిళ్లగూడెం: పది ఫలితాలలో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ మేరకు నగరానికి చెందిన ముత్యాల అఖిలేష్ 592 మార్కులు, గోగం పూజితా లక్ష్మీ 582 మార్కులు సాధించడంతో వారిని సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు సన్మానించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, నగర అధ్యక్షులు మదూరి పూర్ణచంద్రరావు, 50 డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్, సముద్రాల శ్రీనివాసరావు, రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు సైతం అత్యధిక మార్కులు సాధించారని నయబజార్ పాఠశాల హెచ్‌ఎం సుధారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది మాధవరావు, గోపాలక్ష్మీ, సురేష్, విజయ్, కుసుమ, వీఎస్ఎన్.మూర్తి ఉన్నారు.



ఖమ్మం సహకారనగర్: అభినందిస్తున్న హెచ్‌ఎం



ఖమ్మంమామిళ్లగూడెం: అభినందిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

‘ఇగ్నైట్’లో సరస్వతి పూజ



మంత్రి తుమ్మలతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిరాజ్‌నగర్‌లో నూతనంగా నెలకొల్పిన ఇగ్నైట్ పాఠశాలలో శుక్రవారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధునాతన వసతులతో అందరికి అందుబాటులో ఉండే ఫీజులతో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలను నెలకొల్పటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పాటి మాధవరావు, గుర్రం శ్రీహరి, దనిశెట్టి రాజేష్, తుమ్మ రామకృష్ణరెడ్డి, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణ, సరిపుడి రమాదేవి సతీష్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, ఆళ్ల నిరీషారెడ్డి, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చైర్మన్ కుటుంబానికి పరామర్శ

రఘునాథపాలెం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తండ్రి పిచ్చయ్య ఇటీవల మృతి చెందగా పలువురు సంతాపం తెలిపారు. వీ.వీ.పాలెంలో హన్మంతరావు నివాసంలో శుక్రవారం పిచ్చమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నరసింహారావు, టీఎన్జీవోస్ జిల్లా బాధ్యులు తాళ్లూరి శ్రీకాంత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

నేలకొండపల్లి: వర్షానికి ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆయన శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్యపడొద్దని కేంద్రాలకు వచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్,గోవిందరావు, నల్లాని మల్లిఖార్జున్‌రావు, నరేష్ పాల్గొన్నారు.

మావోయిస్టులను చర్చలకు పిలవాలి

కామేపల్లి: మావోయిస్టులను చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మద్దులపల్లిలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, ఆడపా ఉపేందర్, నాగేశ్వరరావు, మంగీలాల్, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, వరికోల్లు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, అనంతరాములు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాలకు ఉద్యోగులు

- విభాగాల వారీగా కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పాలనా సౌలభ్యం కోసం ఇటీవల జోనల్ వ్యవస్థను తీసుకొచ్చారు. నగరంలో ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ జోన్లపా టు సెంట్రల్ జోన్ కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించారు. సెంట్రల్ జోన్ కార్యాలయాన్ని ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తుండగా ఇప్పటికే పాత మున్సిపాలిటీ కార్యాలయంలో సౌత్‌జోన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈనేపథ్యాన పాత మున్సిపాలిటీలోని సౌత్ జోన్‌తో నార్త్ జోన్ కార్యాలయమైన బల్లేపల్లి ప్రాంత కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులను తాజాగా కేటాయించారు.

సౌత్ జోన్ కార్యాలయంలో ఇలా..

సౌత్‌జోన్ పరిధిలో 16, 18, 24, 25, 26, 37, 38, 39, 40, 42వ డివిజన్లు ఉన్నాయి. ఇక్కడి కార్యాలయ ఇంజనీరింగ్ సెక్షన్‌లో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.నరేంద్రతేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ జి.కొండల్‌రావు, లైన్‌మన్ జి.వెంకటరమణను కేటాయించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపర్‌వైజర్ ఎం.తేజస్విని, బిల్డింగ్ ఓవర్‌సీస్ ఇ.దివ్య, చైన్‌మన్ సీహెచ్.యల్లయ్య, రెవెన్యూ విభాగంలో ఆర్ఐ వి.రామారావు, బిల్ కలెక్టర్లు ఎం.నాగరాజు, ఎం.వీరబాబు, కె.ఉపల్లి, ఐ.అవినాష్, డి.నాగరాజు నియమించారు. అలాగే, వార్డు ఆఫీసర్లు బలవంతపు రాజు(16, 18వ వార్డులు), నోసిన రాజు(24, 26), భూక్యా నిరోష(25, 39), వలపదాసు హనీష(40, 42), బండి సంధ్య(37, 38)ను కేటాయించారు. శానిటేషన్ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.మల్లయ్య, జవాన్లు జి.రమేష్, కె.వెంకట రాంబాబు, బి.కోటేశ్వరరావు, కె.రాజు, ఇ.ఆనంద్, జి.వెంకటయ్య, పి.రవికుమార్, ఎ.వెంకటేశ్వర్లు, బి.ఫణికుమార్, ఎం.బంగారితో పాటు కంప్యూటర్ ఆపరేటర్, ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌గా ఎస్.సాయికృష్ణ వ్యవహరిస్తారు.

నార్త్‌జోన్‌లో..

నార్త్‌జోన్ పరిధిలో 1 నుంచి 10 డివిజన్లు ఉంటాయి. ఇంజనీరింగ్ సెక్షన్‌లో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.కే.యాకూబ్‌వలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామయ్య, లైన్‌మన్ ఎస్.సాంబశివరావు, టౌన్ ప్లానింగ్‌లో సూపర్‌వైజర్ ఆర్.సంతోష్‌కుమార్, బిల్డింగ్ ఓవర్‌సీస్ ఐ.సాయిరామ్, చైన్‌మన్ పి.కృష్ణను నియమించారు. రెవెన్యూ సెక్షన్‌కు బిల్ కలెక్టర్లు ఎం.శ్రీను, డి.అప్పయ్య, వై.సాయిరామకృష్ణ, సీహెచ్.రాములు, పి.మాధవరావు, బి.సైదులు, డి.మల్లయ్యను కేటాయించారు. వార్డు ఆఫీసర్లుగా చట్టు సుదర్శన్(1, 2 డివిజన్లు) పులబాల సతీష్(3, 6), యడవల్లి వినోద్‌కుమార్(4, 5), గోదా వంశీకృష్ణ(7, 8), దురిశెట్టి వెంకటేశ్వర్లు(9, 10) నియమితులయ్యారు. శానిటేషన్ విభాగంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.కే.బాబు, జవాన్లు సీహెచ్.ధర్మేందర్, టి.కృష్ణ, బి.విజయ, బి.నాగుబాయి, బి.సైదులు, వి.రామకృష్ణ, ఎం.డీ.అహ్మద్ పాషా, డి.కోటేశ్వరి, తడికమల్ల బాబు, శివసాయికృష్ణ పనిచేస్తారని, కంప్యూటర్ ఆపరేటర్, ప్రజాపాలన హెల్ప్ డెస్క్ బాధ్యతలు బి.సునీత నిర్వర్తిస్తారని అధికారులు వెల్లడించారు.

ఈనెల 16న కేఎంసీ ముట్టడి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: నగర పరిధిలోని పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 16న కేఎంసీని ముట్టడించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. నగర పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఏళ్లుగా కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రం, జిల్లా కమిటీ సభ్యులు జబ్బార్, నవీన్‌రెడ్డి, మీరాసాహెబ్, తిరుపతి రావు, భూక్యా శ్రీనివాస్, సుదర్శన్, నాగ సులోచన , నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి సుందరయ్య



నినాదాలు చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: తెలుగుజాతి ఆణిముత్యం, మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు బి.వెంకటేశ్వరరావు అన్నారు. సుందరయ్య జయంతి సందర్భంగా మండలంలోని తల్లంపాడు, కామంచికల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నువ్వుల నాగేశ్వరరావు, మల్లయ్య, వట్టికోట నరేష్, అరవింద్, అనంతనేని వీరయ్య, వెంకటనర్సయ్య, రామకృష్ణ, జంగం లక్ష్మి, చిరంజీవి, వెంకటేష్ ఉన్నారు.

‘ఉపాధి’ ఉద్యోగుల నిరసన

కామేపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే పే స్కేల్ ఇచ్చి పర్మినెంట్ చేయాలని కోరుతూ శుక్రవారం ఈజీఎస్ కార్యాలయం ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈజీఎస్ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటునే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అద్దంకి శ్రీరాణి, ఈసీ దామల వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బావ్‌సింగ్, భాస్కర్, సుప్రియా, కుమార్, సిబ్బంది శ్రీనివాస్, శంకర్, కోటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



రాపర్తినగర్‌లోని మట్టి రోడ్డు

- డ్రెయినేజీల వ్యవస్థా అంతంతే...
- రాపర్తినగర్‌పై పట్టింపు కరువు

ఖమ్మం రాపర్తినగర్: రాపర్తినగర్‌లోని శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేక ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీఎన్జీఓస్ కాలనీ నుంచి దాశరథి రోడ్డు నంబర్ 1, 2లలో అంతర్గత రోడ్లు లేకపోవడం, డ్రెయినేజీలు ఎప్పుడో నిర్మించినవే ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక వర్షకాలం వస్తే ఈ రోడ్ల వెంట నడవాలంటే నరకప్రాయంగా ఉంటుందని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి అనుమతులు తెచ్చుకున్న రోడ్లు వేయడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అంతర్గత రోడ్లు దాదాపు 10 పైగా ఉన్న ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతర్గత రోడ్లు వేస్తే తమకు వర్షాకాలంలో ఇబ్బందులు తప్పుతాయని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఇక్కడే ఉంటున్న తమకు కావాల్సిన సౌకర్యాలను కల్పించడంలో మున్సిపాల్ అధికారులు విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. అదే విధంగా కాలం చెల్లిన డ్రెయినేజీలతో మురుగు నీరు పోలేని పరిస్థితి ఉందని, మురుగు నీరు అక్కడే ఉండటంతో దోమలు అధికంగా వస్తున్నాయని వాపోతున్నారు. రాపర్తినగర్‌లోని ఏ వీధిలో చూసిన డ్రెయినేజీలు అస్తవ్యస్తంగానే ఉన్నాయని వెంటనే డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు. అయితే కార్పొరేషన్ స్థాయిలో ఉన్న ఖమ్మం నగరంను తీర్చిదిద్దే బాధ్యత మున్సిపల్ శాఖకు ఉన్న ఎందుకు నిర్లక్ష ధోరణి అవలంభిస్తుందో అర్థంకాని ప్రశ్నగా మిగిలిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాపర్తినగర్‌లోని శివారు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డ్రెయినేజీ లేక నిలిచిన మురుగు నీరు